


జిల్లా పరిషత్‌లో పదోన్నతులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 8: జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న అటెండర్లకు రికార్డు, ల్యాబ్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో పదోన్నతి పొందిన ఏడుగురికి జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎం.శ్రీవాణి, కే.మౌనిక, బి.చైతన్య, టి.శ్రీదేవి, పి.సందీప్‌కుమార్, కే.సత్యనారాయణరెడ్డిలు రికార్డు అసిస్టెంట్లుగా, జయమ్మకు ల్యాబ్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు.



బనగానపల్లెలో భూ బకాసురులు

- ఎస్సార్బీసీ భూములకు ఎసరు
- బఫర్ జోన్‌లో వైసీపీ అనుచరుల బరితెగింపు
- హైకోర్టులో స్టే ఉన్నా స్థలాల ఆక్రమణ
- ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో చదును చేస్తున్న వైనం
- అటువైపే వెళ్లని అధికారులు



IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATI

(Special Original Jurisdiction)

FRIDAY, THE SEVENTH DAY OF AUGUST TWO THOUSAND AND TWENTY

:PRESENT:

THE HONOURABLE SRI JUSTICE RAKESH KUMAR

WRIT PETITION NO: 13423 OF 2020

Between:

Vasula Rama Bhupal Reddy, S/o. late Linga Reddy, aged about 45 years, R/o.H.No. 4-6, Bathalurupadu village Banaganapalle mandal Kurnool District.

Petitioner

AND

1. The State of Andhra Pradesh, Rep. by its Principal Secretary, Revenue Department, Secretariat, Velagapudi, Guntur District
2. The District Collector, Kurnool District, Kurnool
3. The Revenue Divisional Officer, Nandyal, Kurnool District
4. The Tahsildhar, Banganapalle Mandal, Kurnool District

Respondents

Petition under Article 226 of the Constitution of India praying that in the circumstances stated in the affidavit filed therewith, the High Court may be pleased to issue an appropriate writ, order or direction more particularly one in the nature Writ of Mandamus, declaring the action of the respondents in developing the SRBC canal/buffer zone lands in Sy.Nos. 311-2C-A, 314-2, 316-1, 317-1A and 246 to an extent of Ac. 9.14 cents, Ac. 5.09 cents, Ac. 9.09 cents, Ac. 9.57 cents and Ac. 17.95 cents respectively of Banumukala Village, Banganapalle Mandal, Kurnool district and Sy.No's 51-5A, 55-5B, 57-1A, 61-2A, 62-1B, 67, 68, 69-1B, 70-1A, 70-1B-2,70-2A-1, 70/2B, 72-1, 73-1A, 132-2B, 133-1, 134-1, 137-1A1 and 147-2A2 to an extent of Ac. 1.78 cents, Ac. 17.20 cents, Ac. 0.78 cents, Ac. 7.23 cents, Ac. 7.66 cents, Ac. 5.06 cents, Ac. 7.20 cents, Ac. 69-1B cents, Ac. 7.33 cents, Ac. 1.74 cents, Ac. 5.47 cents, Ac. 2.18 cents, Ac. 1.48 cents, Ac. 0.50 cents, Ac. 5.11 cents, Ac. 5.57 cents, Ac. 7.42 cents, Ac. 2.27 cents and Ac. 1.25 cents respectively of Banganapalle Village and Mandal, Kurnool district in to house plots for distribution of house sites under Navaratnalu-Pedalandariki Illu scheme though the aforesaid land is prohibited for using for any other purpose, as illegal, arbitrary, colorable exercise of power and consequently forbear the respondents from using the aforesaid land for house sites.

IA NO: 1 OF 2020

Petition under Section 151 CPC praying that in the circumstances stated in the affidavit filed in support of the writ petition, the High Court may be pleased to grant stay of distribution of house sites in Sy No's. 311-2C-A, 314-2, 316-1, 317-1A and 246 to an extent of Ac. 9.14 cents, Ac. 5.09 cents, Ac. 9.09 cents, Ac. 9.57 cents and Ac. 17.95 cents respectively of Banumukala Village, Banganapalle Mandal, Kurnool district and Sy.No's 51-5A, 55-5B, 57-1A, 61-2A, 62-1B, 67, 68, 69-1B, 70-1A, 70-1B-2,70-2A-1, 70/2B, 72-1, 73-1A, 132-2B, 133-1, 134-1, 137-1A1 and 147-2A2 to an extent of Ac. 1.78 cents, Ac. 17.20 cents, Ac. 0.78 cents, Ac. 7.23 cents, Ac. 7.66 cents, Ac. 5.06 cents, Ac. 7.20 cents, Ac. 69-1B cents, Ac. 7.33 cents, Ac. 1.74 cents, Ac. 5.47 cents, Ac. 2.18 cents, Ac. 1.48 cents, Ac. 0.50 cents, Ac. 5.11 cents, Ac. 5.57 cents, Ac. 7.42 cents, Ac. 2.27 cents and Ac. 1.25 cents respectively of Banganapalle Village and Mandal, Kurnool District, pending disposal of W.P.No.13423 of 2020, on the file of the

బఫర్ జోన్ భూములపై హైకోర్టు ఇచ్చిన స్టేటస్‌కో



అధికారం ఉందన్న అహంకారంతో వైసీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. బనగానపల్లెలో భూ బకాసురులుగా మారిపోయారు. కీలక నాయకుల అండదండలతో హైకోర్టులో స్టే ఉన్న భూములను దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. కోర్టు ఉత్తర్వులను లెక్క చేయకుండా బఫర్ జోన్ భూములను కొల్లగొడుతున్నారు. ఎస్సార్బీసీ కాలువకు ఆనుకుని ఉన్న స్థలాలను డోజర్, ట్రాక్టర్లతో చదును చేస్తూ 'ఇది మాది' అని రాళ్లు పాతేస్తున్నారు. బఫర్ జోన్‌లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకూడదని నిబంధనలు చెబుతున్నాయి. అయినా వైసీపీ నాయకుడి అనుచరులు బరితెగింపునకు పాల్పడుతున్నారు. కోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అవసరం ఉంది.

నంద్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి)/ బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని పేదలకు 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఇంటి పట్టాలు ఇచ్చేందుకు 2019లో వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం నియోజకవర్గ అధికార పార్టీ నాయకుడు కొన్ని భూములను సూచించినట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగా బనగానపల్లెలో భూములను పరిశీలించేందుకు 2020లో నంద్యాల ఆర్డీఓ, ఎస్సార్బీసీ ఈఈ, నంద్యాల హౌసింగ్ ఈఈ ఆధ్వర్యంలో ఓ కమిటీ ఏర్పాటైంది. అందులో భాగంగా బనగానపల్లె మండలంలోని బనగానపల్లె, బానుముక్కల, బత్తులూరుపాడు గ్రామాల్లోని సర్వే నంబరు.55/5బీ1లోని 10.50 ఎకరాలు, 61/2ఏ2లోని 2.80 ఎకరాలు, 62/1బీ1లోని 3 ఎకరాలు, 67/1లోని 2 ఎకరాలు, 68/1లోని 1.68 ఎకరాలు, 69/1ఏలోని 6.11 ఎకరాలు, 70/1ఏలోని 7.33 ఎకరాలు, 71-1లోని 1.48 ఎకరాలు, 132-2బీలోని 3.40ఎకరాలు, 133-1లోని 3 ఎకరాలు, 134-1లోని 3 ఎకరాలు, 146-1బీ1లోని 1.70 ఎకరాలు వెరసి మొత్తం 46 ఎకరాల ఎస్సార్బీసీ భూములను పరిశీలించింది. అయితే ఇవన్నీ ప్రభుత్వ భూములు, పైగా బఫర్ జోన్ ప్రాంతం కావడంతో.. ఇక్కడ ఇళ్ల పట్టాలు ఇస్తే అటు ప్రజలకు, ఇటు ఎస్సార్బీసీ కాలువకు ప్రమాదమని కమిటీ సభ్యులు నివేదిక ఇచ్చారు. అయితే పేద ప్రజలకు అనువైన చోట ఇళ్ల పట్టాలు ఇవ్వాలంటూ బనగానపల్లె మండలం బత్తులూరు పాడుకు చెందిన రాంభూపాల్‌రెడ్డి తదితరులు 2020లో హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు ఎస్సార్బీసీ బఫర్‌జోన్ ప్రాంతాల్లో పట్టాలు ఇవ్వకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇస్తూ 28.8.2020లో స్టే విధించింది.

హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

వైసీపీ నాయకులు ఆక్రమిస్తున్న స్థలాన్ని ఆనుకుని ఎస్సార్బీసీ కాలువ ఉంది. ఇక్కడ ఇంటి నిర్మాణాలు చేపడితే కాలువకు గండ్లు పడే ప్రమాదముంది. అసలే ఎస్సార్బీసీ కాలువ మట్టి కట్టలు బలహీనంగా ఉండటంతో గతంలో కాలువకు గండి పడి పట్టణాన్ని ముంచెత్తిన ఘటన స్థానికులకు అనుభవమే! అయినా అధికార పార్టీకి చెందిన వారు ఇవేవీ పట్టించుకునే స్థితిలో లేరు. తమ కన్ను పడిన స్థలాన్ని ఎలాగైనా దక్కించుకోవాలన్న స్వార్థం తప్ప.. ప్రజల గురించిన ఆలోచనే లేదు. ఎస్సార్బీసీ బఫర్ జోన్‌గా ఉన్న స్థానిక బిందెల ఫ్యాక్టరీ నుంచి అయ్యప్పగుడి వరకు ఉన్న స్థలాన్ని రేయింబవళ్లు ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లతో చదును చేసి రాళ్లు పాతుతున్నారు. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని హై కోర్టు స్టే ఇచ్చిందన్న సంగతి బనగానపల్లెలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. అయినా స్థలాలను ఆక్రమిస్తున్నారంటే.. తమకు అండగా స్థానిక అధికార పార్టీ నేత ఉన్నారన్న ధీమాతోనే, హైకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ స్థలాన్ని వైసీపీ నాయకులు ఆక్రమిస్తున్నారు.

అనుకున్నట్లుగానే..

ప్రస్తుతం వైపీపీ నాయకులు చదును చేస్తున్న భూమి బనగానపల్లె - కర్నూలు రహదారికి ఆనుకుని ఉంది. ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటంతో ఈ భూములకు విలువ ఎక్కువగా ఉంది. వీటిని కాజేసేందుకు మొదటి నుంచి అధికార పార్టీ నాయకుడు ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అందులో భాగంగా మొదట ఈ భూములను పేదలకు కేటాయించి, తర్వాత తన పరం చేసుకునేందుకు పావులు కదిపారన్న అనుమానాలున్నాయి. ఈ ఎత్తుగడని పసిగట్టిన స్థానికులు ఇక్కడి స్థలాలను ఇచ్చేందుకు వ్యతిరేకించారు. దీంతో అప్పట్లో ఇళ్ల పట్టాల వ్యవహారం ఆగింది. దీని గురించి అందరూ మర్చిపోయారనుకున్న వేళ అధికార పార్టీ నాయకుడి అనుచరులు గతేడాది ఆక్రమణలకు తెరతీశారు. ఈ విషయంపై గతేడాది అక్టోబరు 11న 'ఎస్సార్బీసీకి ఎసరు' పేరిట ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. అనవసర వివాదం ఎందుకు? అనుకున్న వైసీపీ ఆక్రమార్కులు ఆక్రమణలను నిలిపివేశారు. అయితే ఇక తమ ప్రభుత్వానికి కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని, మళ్లీ అధికారంలోకి వస్తామో? లేదో? అన్న అనుమానంతో ప్రస్తుతం మళ్లీ ఆక్రమణలకు తెరతీశారు. వీరి ఆగడాలను అధికారులు చెక్ పెట్టకపోతే విలువైన ప్రభుత్వ భూములను వైసీపీ వారు హస్తగతం చేసుకుంటారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఎస్సార్బీసీ బఫర్ జోన్‌లో బండలు పాతుకున్న దృశ్యం

అధికారుల మౌనం ఎందుకో..?

ప్రస్తుతం వైసీపీ అనుచరులు ఎస్సార్బీసీ బఫర్ జోన్‌లో దర్జాగా ఆక్రమణ పనులు చేస్తున్నారు. ఇదంతా ఓపెన్‌గానే జరుగుతోంది. ఇంత యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు వైసీపీ నాయకులు నుంచి భారీగా ముడుపులు అందుకుని, వారి అడుగులకు మడుగులు ఒత్తుతున్నారన్న అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇక ఇదే భూముల్లో అటవీ శాఖకు సంబంధించిన భూములు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాలకు స్పందించిన అటవీ శాఖ అధికారులు తమ భూములను ఆక్రమణదారుల నుంచి కాపాడుకుంటామని చెప్పగా, రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అయితే నాలుగు నెలల తిరగకుండానే ఆక్రమణదారులు మళ్లీ అవే భూములను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారంటే.. అటవీ, ఎస్సార్బీసీ, రెవెన్యూ శాఖ అధికారులంటే అక్రమార్కులకు ఎంత చిన్న చూపో అర్థమవుతోంది. ఇక బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు ఇలా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నంద్యాల త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఆశా వర్కర్లు

అర్ధరాత్రి ఆశాల అరెస్టు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 8 : సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ చేపట్టిన ఆశా కార్యకర్తలను జిల్లా వ్యాప్తంగా పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో మెడికల్ లీవ్స్ తదితర డిమాండ్లతో ఆందోళన చేపట్టేందుకు ఏపీ ఆశా కార్యకర్తల సంఘం, సీఐటీయూ చలో విజయవాడకు పిలుపునిచ్చాయి. దీంతో వియజవాడకు వెళ్లవద్దని హెచ్చరిస్తూ జిల్లా వ్యాప్తంగా పలువురు ఆశా కార్యకర్తలకు పోలీసులు బుధవారమే నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ నంద్యాల, ఆత్మకూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, పాణ్యం తదితర ప్రాంతాల నుంచి ఆశా కార్యకర్తలు విజయవాడకు వివిధ మార్గాల్లో వెళ్లారు. మరికొందరిని పోలీసులు స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించి, రాత్రి వదిలిపెట్టారు. తమ సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ కార్యక్రమం చేపట్టిన ఆశా వర్కర్లను బుధవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఆశా వర్కర్లు విజయవాడకు బయలుదేరేందుకు నంద్యాల రైల్వే స్టేషన్‌కు వెళ్లగా.. అక్కడ పోలీసులు వారిని అడ్డగించి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్‌లో ఆశాలు, సీఐటీయూ నాయకులు ఆందోళనకు దిగారు. శాంతియుతంగా పోరాటాలు చేస్తుంటే ప్రభుత్వానికి పోలీసులు కార్యకర్తల్లా వ్యవహరిస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడటం సరైన పద్ధతి కాదని ధ్వజమెత్తారు. అనంతరం ఆశా కార్యకర్తలను సొంత పూచీకత్తుపై పోలీసులు విడిచిపెట్టారు.

బుగ్గనది అంకెల గారడీ: మాజీ ఎమ్మెల్యే బీసీ



బనగానపల్లె, ఫిబ్రవరి 8: అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మరోసారి అంకెలగారడీని ప్రదర్శించారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్త అంశాలు తప్ప మరేమీ లేవన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేని బడ్జెట్ అని మండిపడ్డారు. ప్రతి అంశంలో ఎన్నికల ముందు బడ్జెట్‌తో హడావుడి చేశారన్నారు. రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్య లోటును రూ.60వేల కోట్లకుపెంచిన చెత్త ఘనత ఆర్థిక మంత్రి బుగ్గనకే దక్కిందన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో మరేమీ లేదన్నారు. ప్రస్తుతం ఏపీ అప్పులు రూ.11.58 లక్షల కోట్లు దాటాయని తెలిపారు. వైసీపీ పాలనలో అప్పులు రెట్టింపయ్యాయన్నారు. 2019లో టీడీపీ తీసుకున్న దానికంటే 4 రెట్లు అప్పులు తీసుకొని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి సీఎం జగన్ నెట్టివేశాడని బీసీ ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన ప్రతి స్కీం ఓ స్కాంగా మారిందని విమర్శించారు. నాడు-నేడు పనుల్లో రూ.3 వేల కోట్ల మేర అవినీతి జరిగిందని ఆరోపించారు.

శ్రీశైలం రిజర్వాయర్ పరిశీలన

శ్రీశైలం, ఫిబ్రవరి 8: శ్రీశైలం జలాశయాన్ని గురువారం ఎన్‌డీఎస్‌ఏ, కేఆర్ఎంబీ బృందం సభ్యులు పరిశీలించారు. ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ వివేక్ త్రిపాఠి, సాంకేతిక సభ్యుడు రాకేష్ కాస్యం కేఆర్ఎంబీ సభ్యుల బృందంతో జలాశయం భద్రత, నీటి నిల్వల వినియోగం, డ్యాం క్రస్టుగేట్లు, గ్యాలరీ, రోప్స్, ప్లంజ్‌పూల్ మొదలైన వాటిని పరిశీలించారు. 2009లో వచ్చిన వరద ప్రవాహానికి జలాశయం పరిస్థితి ఎలా ఉండిందని డ్యాం అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఈ కబీర్‌బాషా మాట్లాడుతూ నేషనల్ జలశక్తి సూచనల మేరకు డ్యాం జలాశయం ఎన్‌డీఎస్‌ఏ, కేఆర్ఎంబీ బృందం పరిశీలించి డ్యాం స్థితిగతులను క్షుణ్ణంగా తెలుసుకున్నారని అన్నారు. అలాగే జలాశయం ముందుభాగంలోని ప్లంజ్‌పూల్ నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారన్నారు. డ్యాం మూడు గ్యాలరీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి నిర్వహణపై ఆరా తీశారన్నారు. అదేవిధంగా జలాశయం క్రస్టుగేట్ల పనితీరును పరిశీలించారని తెలిపారు. గతంలో జలాశయం మరమ్మతులకు రూ. 135 కోట్ల అంచనాతో ప్రతిపాదనలను ప్రపంచ బ్యాంక్‌కు పంపించామని ఎన్‌డీఎస్ఏ, కేఆర్ఎంబీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం పనితీరుకు ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన తెలిపారు.



పరిశీలిస్తున్న ఎన్‌డీఎస్‌ఏ, కేఆర్ఎంబీ బృందం

ఇంటింటికి రేషన్ ఎక్కడ?

సంజామల్ల, ఫిబ్రవరి 8: వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన ఇంటింటికి రేషన్ పథకం మండలంలో అభాసుపాలైంది. చౌక దుకాణాల డీలర్ల ఇళ్ల వద్దకు వెళ్ళకుండానే నిత్యావసర సరుకులను ఇస్తారని అనుకున్న కార్డుదారుల ఆశలు అడియాశలయ్యాయి. మండల వ్యాప్తంగా 32 చౌక దుకాణాల నుంచి వివిధ గ్రామాలలో 12,519 మంది రేషన్ కార్డుదారులకు ఇంటికి రేషన్ పంపిణీ చేయడానికి 6 వాహనాలను, ఏండీయూ ఆపరేటర్లను ఏర్పాటు చేశారు. ఈ పథకం ప్రారంభం నుండి ఇంటింటికి రేషన్ అందిన దాఖలాలు లేవని కార్డుదారులు విమర్శిస్తున్నారు. పథకం ప్రారంభించిన తొలి రోజుల్లో గ్రామంలోని ప్రధాన వీధుల్లోకి ఏండీయూ ఆపరేటర్ల వాహనాలతో వచ్చి అందజేసేవారు. ప్రస్తుతం మండల కేంద్రం మినహాయించి గ్రామాలలో డీలర్ల ఇళ్ల వద్దనే ఏండీయూ ఆపరేటర్లు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నారు. మండలంలోని కానాల మంగంపల్లె, గిద్దలూరు రామభద్రుని పల్లె కమలపురి, వసంతాపురం, ముదిగేడు, ముచ్చలపురి తదితర గ్రామాలలో బియ్యం వాహనం రావడం లేదని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి కార్డుపై రూ.6 అధికంగా వసూలు చేస్తున్నారని కార్డుదారులు విమర్శిస్తున్నారు. అర కిలో పంచదార రూ.17కు అందించాల్సి ఉండగా రూ.20, కందిపప్పు రూ.67 ఇవ్వాల్సి ఉండగా రూ.70 వసూలు చేస్తున్నారని కార్డుదారులు విమర్శిస్తున్నారు.

బియ్యం పంపిణీలో దగా

పేదలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీ ఆపరేటర్లు దగా చేస్తున్నారని కార్డుదారులు ఆగ్రహిస్తున్నారు. 15 కిలోలు ఇవ్వాల్సిన కార్డుదారులకు రెండు బకెట్లలో బియ్యం పెట్టి తూకం వేస్తూ ప్రతి కార్డు నుంచి కిలో నుంచి 2 కిలోల వరకు లాగేస్తున్నారని కార్డుదారులు వాపోతున్నారు.



కానాలలో డీలర్ ఇంటి వద్ద సరుకులు పంపిణీ చేస్తున్న ఏండీయూ ఆపరేటర్



ఇంటి వద్దకు బియ్యం రావడం లేదు

ఇంటింటికి రేషన్ పంపిణీ ప్రారంభించినప్పటి నుంచి కాలనీకి బియ్యం వచ్చిన దాఖలాలు లేవు. ప్రతి నెలా డీలర్ల ఇంటి వద్దకే నిత్యావసర వస్తువులు వెళ్లి తెచ్చుకుంటున్నాం. ప్రభుత్వ ఉద్దేశం నెరవేరలేదు.

-రామాంజనేయులు గిద్దలూరు, సంజామల మండలం

రేషన్ దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు

రేషన్ డీలర్ల ఇంటి వద్ద సరుకులకు వెళ్లినా ఎండీయూ ఆపరేటర్లు సరుకులను అధిక ధరలను విక్రయిస్తున్నారు. చక్కెర కిలో రూ.17లకు విక్రయించాల్సి ఉండగా రూ.20 తీసుకుంటున్నారు.

-రవికుమార్, గిద్దలూరు



అగ్రిగోల్డు బాండ్లు వాపసు

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 8: అగ్రిగోల్డు కంపెనీకి చెందిన బాండ్లను లోక్ అదాలత్‌లో వాపసు చేస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన అగ్రిగోల్డు బాధితులకు సంబంధించిన రూ.10వేలకు లోబడి ఉన్న బాండ్లు, ఒకటికన్నా ఎక్కువగా కలిగి ఉన్న బాండ్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో వాపసు చేసుకున్నారని ఆయన తెలిపారు. బాధితులు తమ ఒరిజినల్ రసీదులను లోక్ అదాలత్ కార్యాలయంలో అందజేసి బాండ్లను వాపసు తీసుకోవాలని ఆయన ప్రకటనలో తెలిపారు.

శాశ్వత లోక్ అదాలత్‌లో
ఇద్దరు విద్యార్థులకు న్యాయం

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 8: కళాశాలలో కోర్సులు పూర్తయినా కూడా సర్టిఫికెట్లు ఇవ్వకుండా తమ కళాశాల జాప్యం చేస్తోందని శాశ్వత లోక్‌అదాలత్‌ను ఆశ్రయించిన ఇద్దరు డిగ్రీ విద్యార్థులకు సత్వర న్యాయం లభించింది. కర్నూలుకు చెందిన ఇద్దరు డిగ్రీ విద్యార్థులు డి.అమృత్‌రాజ్ అశోక్, కే.డేనియల్ జాన్‌లు ఎస్‌కే యూనివర్సిటీ దూరవిద్య ద్వారా స్థానిక ఎస్టీబీసీ కళాశాలలో తమ డిగ్రీని పూర్తి చేశారు. అయితే వారికి కళాశాల టీసీ, మైగ్రేషన్ సర్టిఫికెట్లు సత్వరంగా అందజేయలేదు. దీంతో ఆ విద్యార్థులు శాశ్వత లోక్‌అదాలత్‌ను ఆశ్రయించగా.. ఎస్టీబీసీ కళాశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేసింది. దీంతో ఇరుపక్షాలకు ఆమోదకరంగా కేసును పరిష్కరించి విద్యార్థుల సర్టిఫికెట్లను కళాశాల అధికారులు శాశ్వత లోక్‌అదాలత్‌లో అందజేశారు. ఈ సందర్భంగా శాశ్వత లోక్‌అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్ మాట్లాడుతూ ప్రజాప్రయోజిత వివాదాలను శాశ్వత లోక్‌అదాలత్ ద్వారా సత్వరంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్‌అదాలత్ సభ్యులు టి.శివశంకర్ రెడ్డి, డి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీడీఆర్‌లో గనుల సమాచారం
డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్


సదస్సులో పాల్గొన్న గనుల శాఖ అధికారులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 8: ఖనిజాలు, భూములు, గనుల శాఖకు చెందిన 14 రకాల వివరాలను నేషనల్‌సైన్స్ జియో డేటా రికవరీ సెంటర్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్లు గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు గురువారం విజయవాడలోని పార్క్‌హయత్ హోటల్‌లో జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా నుంచి రాజశేఖర్‌తో పాటు బనగానపల్లె ఏడీ రాజగోపాల్, నంద్యాల ఏడీ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. దేశంలో అన్ని ప్రాంతాల్లోని ఫీల్డ్ స్టడీస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ఎన్‌జీడీఆర్ పోర్టల్‌లో అందుబాటులో కేంద్రప్రభుత్వం ఉంచిందని వారు తెలిపారు.

సమర్థవంతంగా పని చేస్తే ఫలితాలు అద్భుతం

- ప్రజా సేవతోనే విద్యుత్ ఉద్యోగులకు గుర్తింపు
- దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ కె.సంతోషరావు


విద్యుత్ ఉద్యోగులను సన్మానిస్తున్న సీఎండీ కె.సంతోషరావు, ఎస్ఈ ఎం ఉమాపతి

కల్లూరు, ఫిబ్రవరి 8: సమర్థవంతంగా పని చేస్తే ఫలితాలు ఎంత అద్భుతంగా ఉంటాయనడానికి కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖ చక్కటి ఉదాహరణ అని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు అన్నారు. గురువారం విద్యుత్ భవన్‌లోని కర్నూలు సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆధ్వర్యంలో మిచాంగ్ తుఫాన్‌లో విశిష్ఠ సేవలందించిన ఉద్యోగులకు ఉత్తమసేవా పురస్కారాలను సీఎండీ అందజేశారు. ఈ సందర్భంగా కె.సంతోషరావు మాట్లాడుతూ నెల్లూరు సర్కిల్లో మిచాంగ్ తుఫాన్ వల్లదెబ్బతిన్న 33కెవి, 11కెవి విద్యుత్ లైన్ల పునరుద్ధరణకు సీఎండీ ఆదేశాలను అందుకున్న గంటల వ్యవధిలోనే ఎస్ఈ ఉమాపతి పనులు మొదలు పెట్టారన్నారు. ఆ సమయంలో తుఫాన్ ఎక్కడ తీరం దాటుతుందో అర్థంకాని పరిస్థితుల్లో నెల్లూరుకు వచ్చిన కర్నూలు జిల్లా ఇంజనీర్లు, ఉద్యోగులు, సిబ్బంది శక్తివంచన లేకుండా యుద్ధప్రతిపాదికన పనిచేశారని అన్నారు. వినియోగదారులకు అతితక్కువ సమయంలో విద్యుత్ సరఫరా ఇవ్వడానికి కృషిచేశారని అభినందించారు. ప్రజా సేవతోనే విద్యుత్ ఉద్యోగులకు గుర్తింపు, గౌరవం వస్తుందని అన్నారు. కర్నూలు సర్కిల్ క్రమశిక్షణకు మారుపేరని ఎస్ఈ ఎం.ఉమాపతి ఆధ్వర్యంలో వరుసగా రెండో సారి జిల్లా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకోవడం ఆనందంగా ఉందని సీఎండీ కె.సంతోషరావు అన్నారు. అనంతరం మిచాంగ్ తుఫాన్‌లో సేవలందించిన ఉద్యోగులను సీఎండీ సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఈలు, ఏడీఈలు, ఏఈలు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్జరీ వికటించి వ్యక్తి మృతి


బాల మద్దిలేటి మృతదేహం

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 8 : నంద్యాలలోని ఇండస్ గుండె ఆసుపత్రిలో సర్జరీ వికటించి బాల మద్దిలేటి (35) అనే వ్యక్తి గురువారం మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి యాజమాన్యంపై ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. నంద్యాలలోని సాయిబాబానగర్‌కు చెందిన వ్యాపారి బాలమద్దిలేటికి మూడు రోజుల క్రితం గుండె నొప్పి రావడంతో నంద్యాల శ్రీనివాస సెంటర్‌లోని ఇండస్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించి గుండెకు సర్జరీ చేయాలని వైద్యులు తెలిపారు. ఈ మేరకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ చేయించారు. ఆ తర్వాత పేషెంట్ బాగున్నాడని వైద్యులు చెప్పారు. అయితే పేషెంట్ శరీరంలో కిడ్నీ సంబంధిత వ్యాధి ఉండటం వల్ల డయాలసిస్ చేయాలని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీనికి అదనంగా రూ.1.5 లక్షలు వసూలు చేశారు. ఆ తర్వాత బాల మద్దిలేటి కోమాలోకి వెళ్లాడు. ఈ సంగతి తమ వద్ద దాచిపెట్టి ఆపరేషన్ ముందు ఇచ్చిన మత్తు ఇంకా వీడలేదని కుటుంబ సభ్యులు చెప్పుకొచ్చారు. ఆ తర్వాత బాలమద్దిలేటి మృతి చెందాడని వైద్యులు చెప్పడంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వన్ టౌన్ సీఐ చలపతి, సిబ్బంది ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు.

పోలీసుల తీరుపై మండిపాటు: బాధితుల పక్షాన నిలిచి న్యాయం చేయాల్సిన పోలీసులు ఆసుపత్రి యాజమాన్యం పక్షాన నిలబడి మాట్లాడుతు న్నారని బాధితులు మండిపడ్డారు. ఘటన మీద విచారణ జరపకుండా ఆందోళనకు దిగిన వారిని, అక్కడ ఉన్న మీడియా వారిని పోలీసులు బలవంతంగా ఆసుపత్రి మొదటి అంతస్తు నుంచి కిందికి పంపించారు. న్యాయం జరగాలని ఆసుపత్రి ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు.

దేవదాయ శాఖలో పదోన్నతులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 8: దేవదాయ శాఖలో పని చేస్తున్న నలుగురు సహాయ కమిషనర్లకు ఉప కమిషనర్లుగా పదోన్నతి కల్పిస్తూ విజయవాడ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలో కర్నూలు ఇన్‌చార్జి ఉప కమిషనర్‌గా విధుల్లో కొనసాగుతున్న గురుప్రసాద్‌కు పదోన్నతి కల్పిస్తూ రెగ్యులర్ ఉప కమిషనర్‌గా, కర్నూలు జిల్లాలో సహాయ కమిషనరుగా విధులు నిర్వహిస్తున్న ఎం రామాంజనేయులుకు ఉప కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం రంగాపురంలో వెలసిన మద్దిలేటి స్వామి కార్యనిర్వహణాధికారిగా నియమించారు. జేఈవో విధులు నిర్వహిస్తున్న కే వాణికి ఉప కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పంపించారు. సహాయ కమిషనర్ హెచ్‌జీ వెంకటేష్‌కు ఉప కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉరుకుంద ఈరన్న దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఉత్తర్వులు జారీ చేశారు. వీరు గురువారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నట్లు జిల్లా దేవదాయ శాఖాధికారులు పేర్కొన్నారు.

జగన్ పాలనలో ఎటు చూసినా దోపిడే : టీడీపీ


బీటీ నాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 8: జగన్ పాలనలో ఎటు చూసినా దోపిడీ కనిపిస్తున్నదని శాసన మండలి ఉప నాయకుడు, జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. గురువారం బడ్జెట్‌పై శాసన మండలిలో ఆయన స్పందిస్తూ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడి తప్ప మరోటి లేదన్నారు. విద్యార్థికిచ్చే ట్యాబ్స్‌లో రూ. వెయ్యి కోట్ల అవినీతి, నాడు-నేడు పేరుతో రూ3 వేల కోట్ల దోపిడీ, జగనన్న విద్యాదీవెనలో 7 లక్షల మంది విద్యార్థులకు కోత, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కట్ చేసిన జగన్ ప్రభుత్వం, నాసిరకం మద్యం విక్రయంతో 30 వేల మంది ప్రాణాలను పొట్టన పెట్టుకోవడం, తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్ రద్దు, 35 లక్షల పొదుపు గ్రూపులకు బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపడం, సున్నా వడ్డీ పంట రుణాలను రూ. 5 లక్షల నుంచి రూ. 3 లక్షలకు కుదించడం, బీసీ సబ్ ప్లాన్ నిధులు రూ.75 వేల కోట్ల దారి మళ్లించడం వంటి విధానాలతో జగన్ ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందని అన్నారు.

బుగ్గనను సాగనంపుదాం

అంకెల గారడితో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని సాగనంపుదామని బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనరు వై. నాగేశ్వరరావు యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బడ్జెట్‌పై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డోన్ నియోజకవర్గం అభ్యర్థి ఎంపికపై ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని కోరారు. రూ. 13 వేల రెవెన్యూ లోటును. రూ. 44వేల కోట్లకు, రూ. 35 వేల ద్రవ్య లోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అప్పులు రూ. 11.58 లక్షల కోట్లు అని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ధరలు పెంపు, పన్నుల భారం, రిజిస్ట్రేషన్ ఫీజు పెంపు, విద్యుత్ చార్జీలు పెంపుతో రాష్ట్ర ప్రజలు నలిగిపోతున్నారని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ అనుబంధ కమిటీల అధ్యక్షుడు డీ. జేమ్స్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు హనుమంతరాయ చౌదరి, మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్షావలి పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- నలుగురికి తీవ్ర గాయాలు
- 16 మందికి స్వల్ప గాయాలు


నుజ్జునుజ్జయిన ఆర్టీసీ బస్సు ముందు భాగం


గాయాలైన ప్రయాణికులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 8: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి 40పై ఓర్వకల్లు గ్రామ సమీపాన గుట్టపాడు స్టేజీ వద్ద గురువారం మధ్యాహ్నం లారీని బస్సు ఢీకొనడంతో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. 16 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలాన్ని ఓర్వకల్లు ఎస్ఐ రాజారెడ్డి సందర్శించి క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్ వాహనం, 108 వాహనాల్లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుట్టపాడు స్టేజి వద్ద రాజస్థాన్‌కు చెందిన లారీ నంద్యాలకు వెళ్తుండగా.. టైరు పంక్చర్ కావడంతో లారీ డ్రైవర్ ఖన్‌లేజ్ టైరును పంక్చర్ వేయించుకుని కదులుతుండగా.. వెనుకవైపు నుంచి నంద్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో అందులో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. మధుసూదన్‌రావు, నక్కాదేవి, కీర్తన, బస్సు డ్రైవర్ రాముడు తీవ్రంగా గాయపడ్డారు. మరో 16 మందికి స్వల్పగాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

నేటి నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు(హస్పిటల్), ఫిబ్రవరి 8: నులి పురుగుల బారిన పడిన పిల్లలు శారీరకంగా, మానసికంగా బలహీన పడతారని కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య అన్నారు. గురువారం జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ చిన్నారుల్లో అనారోగ్య సమస్యకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు శుక్రవారం జాతీయ నులి పురుగుల నివారణ దినం నిర్వహిస్తున్నామన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. 1-2 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు 1/2 మాత్రను పొడి చేసి శుభ్రమైన నీటిలో కలిపి తాపాలని సూచించారు. 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న బాలబాలికలకు 400 ఎంజీ మాత్రను భోజనం చేసిన తర్వాత చప్పరించి తినిపించాలని వైద్యాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ మాత్రలు మింగడం వల్ల ఎలాంటి దుష్పరిణామాలు ఉండవని, నులిపురుగులు కడుపులో ఉండటం వల్ల పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత వస్తాయన్నారు. దేశ వ్యాప్తంగా ఒకే రోజు నిర్వహించడం వల్ల నులి పురుగుల వ్యాప్తిని నివారించ వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ హేమలత, డెమో ప్రమీలాదేవి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా శివరాత్రిపై కలెక్టర్ సమావేశం

శ్రీశైలం, ఫిబ్రవరి 8: శ్రీశైల క్షేత్రంలో మార్చి 1 నుంచి 11 వరకు జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం ఉదయం 11 గంటలకు కలెక్టర్ కె. శ్రీనివాసులు సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొంటారు. దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూములో ఈ సమావేశం జరగనుంది.

20 గడ్డివాములు దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హొళగుంద, ఫిబ్రవరి 8: మండలంలోని హెబ్బటం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద శేషప్ప, ఈరన్న, హనుమంతు, నాగేష్‌తో పాటు మరో పదిమంది గడ్డివాములు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం గురువారం జరిగింది. తెల్లవారు జామునన గడ్డివాముల నుంచి దట్టమైన పొగలు రావడం గమనించినట్లు గ్రామస్థులు భీమేష్, పీర్‌సాబ్ గురువారం తెలిపారు. ఆలూరు, ఆదోని అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను అదుపు చేసినట్లు తెలిపారు. గడ్డివాముల విలువ సుమారు రూ. 3 లక్షలకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రమాద స్థలాన్ని తహసీల్దార్ ప్రసాద్‌రాజు పరిశీలించారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ





మంత్రాలయం, ఫిబ్రవరి 8. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. గురువారం దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, మధ్వమార్గ్ కారిడార్, భక్తులతో కోలాహలంగా మారాయి. భక్తులు రథోత్సవాలలో పాల్గొని మఠం పీఠాధిపతి ఆశీస్సులు పొందారు.

శాశ్వత సేవకు
రూ.1.25 లక్షల విరాళం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన వర మహా లక్ష్మమ్మ అనే భక్తురాలు రూ.1.25 లక్షలు శాశ్వతసేవ కు విరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

రమణీయంగా రజిత రథోత్సవం

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయల రజిత రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజిత రథంపై ప్రహ్లాదరాయలను ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ చేశారు.

మంత్రాలయం చేరుకున్న పీఠాధిపతి

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పది రోజుల ధార్మిక పర్యటన ముగించుకుని గురువారం తెల్లవారుజామున మంత్రాలయం చేరుకున్నారు. గత పది రోజులుగా బెంగుళూరు, తిరుపతిలో ధార్మిక పర్యటన చేస్తూ అక్కడే సంస్థాన పూజలు చేశారు.

అంతర్రాష్ట్ర
దొంగ అరెస్టు

బంగారు ఆభరణాలు, నగదు రికవరీ


నిందితుడి అరెస్టు చూపుతున్న ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య

శిరివెళ్ల, ఫిబ్రవరి 8 : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో దొంగతనానికి పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగను శిరివెళ్ల పోలీసులు అరెస్టు చేశారు. శిరివెళ్ల పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య వివరాలు వెల్లడించారు. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన సంపంగి శ్రీరాములు, యనకండ్ల గ్రామానికి చెందిన సుబ్రమణ్యం ఈ నెల 8న శిరివెళ్ల మండలం వెంకటాపురం గ్రామంలోని పల్లవు నాగాంజనేయులు ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. నిందితుడు సంపంగి శ్రీరాములును పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో నిందితుడైన సుబ్రమణ్యం పరారయ్యాడు. సంపంగి శ్రీరాములు నుంచి రూ.1.70 లక్షల విలువ చేసే రెండు బంగారు చైన్‌లు, మూడు బంగారు ఉంగరాలు, ఒక జత బంగారు బుట్ట కమ్మలు, ఒక జత చిన్న మాటీలు, 15 తులాల వెండి కాళ్ల పట్టీలతో పాటు రూ.15 వేల నగదును రికవరీ చేశారు. అలాగే జలదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ దొంగతనం కేసుకు సంబంధించి రెండు తులాల బంగారు చైన్, ఒక జత బంగారు కమ్మలు, 23 తులాల వెండి పట్టీలు సైతం స్వాధీనం చేసుకున్నారు. శ్రీరాములు గురించి సమగ్రంగా దర్యాప్తు నిర్వహించగా కర్నూలు, ఓర్వకల్లు, తుని, అచ్చంపేట, కనిగిరి, బేతంచర్ల, నందివర్గం, వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని పలు ఆలయాలు, ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు 15 కేసులు నమోదయ్యాయి. నందివర్గం పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్‌తోపాటు నందివర్గం, బేతంచర్ల పీఎస్‌లలోని కేసుల్లో ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. సంపంగి శ్రీరాములును అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరురచగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించారు. కార్యక్రమంలో శిరివెళ్ల సర్కిల్ సీఐ వంశీధర్, ఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, పోలీసు సిబ్బంది నాగేష్, ప్రసన్న కుమార్, శేషన్న, బాల సుబ్బయ్య, నీలకంఠం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 8 : నంద్యాల మండలం అయ్యలూరు మెట్ట గ్రామానికి చెందిన రాణి (30) ఇంట్లో ఉరి వేసుకొని బుధవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకుంది. రాణికి తన మేనమామ భూపాల్‌తో 11 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. పిల్లలను స్కూల్‌కు పంపించకుండా ఇంట్లోనే ఉంచుకోవడంతో భూపాల్ భార్యను మందలించాడు. ఈ విషయంపై ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో బుధవారం రాత్రి తిరిగి ఇద్దరు ఫోన్‌లో తగవుపడ్డట్లు స్థానికులు తెలిపారు. దీంతో మనస్తాపానికి గురైన రాణి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. మృతురాలు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నదని, ఆ నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని తల్లి శీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆదోని, ఫిబ్రవరి 8: ఆదోని పట్టణంలోని ఎస్కేడి కాలనీలోని సఫారీ బిల్డర్స్‌లో నివాసం ఉంటున్న రమేష్ (28) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. సఫారీ బిల్డర్స్‌లోని డ్రైవర్‌తో పాటు వాచెమెన్‌గా పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. అయితే అప్పులు అధికమవడంతోనే తన కుమారుడు మృతి చెందాడని తల్లి నాగలక్ష్మి బోరున విలపించారు. మృతిడికి భార్య నాగివేణితో పాటు ఇద్దరు పిల్లలు సంతానం. తలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్న ప్రభుత్వం



భాస్కరాపురంలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 8: ప్రజా వ్యతిరేక విధానాలతో జగన్ రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తున్నాడని రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. మండలంలోని భాస్కరాపురంలో గురువారం బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. వైసీపీ నాయకుల ఆగడాలు, దౌర్జన్యాలు పెరిగిపోతాయని తెలిపారు. చంద్రబాబును గెలిపిస్తే పంటలకు గిట్టుబాటు ధరతోపాటు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉసేనయ్య, సోమశేఖర్‌గౌడు, సురేంద్రనాథ్‌రెడ్డి, రమణారెడ్డి, పిక్కిలి శ్రీనివాసులు, శివరామిరెడ్డి, మద్దూరు సుధకార్, బాబు, హనుమంతరెడ్డి, పెద్దకృష్ణ, ముగన్న, చిన్నకృష్ణుడు, సహదేవుడు, చిన్నయ్య, వీరాస్వామి, శేఖర్, ప్రతాప్ , యేసు, నరసింహ, సుబ్బన్న, జమీల్, పురుషోత్తంరెడ్డి, హరికృష్ణ, శాలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి

● ఆత్మకూరు ఆర్‌డీవో దాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో దాసు

నందికొట్కూరు ఫిబ్రవరి 8: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆత్మకూరు ఆర్‌డీవో దాసు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆర్డీవో దాసు, డీఎస్సీ శ్రీనివాసరావులు తహసీల్దార్లు, బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు ఆర్డీవో దాసు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆయన సూచించారు. సమావేశంలో పట్టణ, రూరల్ సిఐలు ప్రకాష్ కుమార్, విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు: ఏపీజీబీ ఆర్‌ఎం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీబీ ఆర్‌ఎం వెంకటరమణ

వెలుగోడు, ఫిబ్రవరి 8: ఖాతాదారులకు అందించే సేవలతోనే బ్యాంకులకు గుర్తింపు లభిస్తుందని ఏపీజీబీ ఆర్‌ఎం వెంకటరమణ, ఎస్‌ఎం రమేష్‌లు అన్నారు. గురువారం వెలుగోడు పట్టణంలోని ఏపీజీబీలో క్లస్టర్ పరిధిలోని ఆయా శాఖల బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులకు వచ్చే ఖాతాదారులకు సకాలంలో సేవలందించాలని, తద్వారా బ్యాంకు ఖాతాదారుల సంఖ్యను పెంచాలని సూచించారు. అన్ని రంగాల వారిని ప్రోత్సహించి, డిపాజిట్ల సేకరణను పెంచాలని కోరారు. అలాగే ఖాతాదారులకు లోన్లు మంజూరు చేయడమేగాక వాటిని రికవరీ చేసే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఎప్పటికపుడు బ్యాంకులు అందించే పథకాలు, సేవలు, సబ్సిడీల గురించి వివరించాలని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు సూర్య తేజ, మనోజ్, రవి, చాంద్‌బాషా పాల్గొన్నారు.

టీడీపీతోనే సమగ్రాభివృద్ధి, సంక్షేమం



టీడీపీ పథకాల గురించి వివరిస్తున్న తాటికొండ బుగ్గరాముడు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 8: టీడీపీతోనే సమగ్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు, 38వ వార్డు ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు అన్నారు. గురువారం నంద్యాలలోని 38వ వార్డు వైఎస్‌ఆర్ నగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్ -6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరిట ప్రజలపై అధిక భారాన్ని మోపుతూ పన్నుల రూపంలో వసూలు చేసిందని, నాయకులు దోచుకోవడమే తప్ప అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను వైసీపీ మోసం చేసిందని, వచ్చే ఎన్నికల్లో రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలు వైసీపీని బంగాళాఖాతంలో కలిపేస్తారని అన్నారు. ప్రజలు టీడీపీని ఆదరిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటికొండ నరేష్, శివ, సుబ్బరాయుడు, ఇమాం, హుసేన్‌బాష, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో కరోనా నివారణ



రోగులను పరిశీలిస్తున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు యశోద

నంద్యాల క్రైం, జనవరి 8: కరోనా నివారణలో ఆయుర్వేద వైద్యం భేషుగ్గా పని చేస్తుందని నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఆయుర్వే ద విభాగానికి చెందిన డాక్టర్ యశోద అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ కరోనా మహమ్మారి కొంతకాలం స్తబ్దుగా ఉండి తిరిగి వేరే వేరియంట్ల రూపంలో వ్యాపిస్తోందని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. వంటింట్లో లభించే చెక్క, లవంగాలు, యాలకు లు, మిరియాలు, పసుపు, సొంఠి లాంటి వాటితోనే కరోనా, దాని వేరియంట్లు సోకకుండా చేసుకోవచ్చని చెప్పారు. ఆయుర్వేద వైద్య విధానం భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ఒకటన్నారు. కరోనా రాకుండా అడ్డుకోవడంలో ఆయుర్వేద వైద్య విధానంలో చక్కటి పరిష్కార మార్గాలు ఉన్నాయని తెలిపారు. పోపు డబ్బాలో లభించే దినుసులను క్రమం తప్ప కుండా ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తే దేహంలో రోగ నిరోధక శక్తి పెరిగి ఎలాంటి రుగ్మతలు దరి చేరకుండా చూసుకోవచ్చని వివరించారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సర్వ నాశనం

● మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి



సుండిపెంటలో మహిళకు అభివాదం చేస్తున్న బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 8: వైసీపీ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నాశనమైందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక మంత్రి బుగ్గన అబద్ధాల ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నంగా మారిందని అన్నారు. వైసీపీ విధానాల వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ స్థానం 8 నుంచి 11కు దిగజారిందని వివరించారు. సీఎం జగన్ దోపిడీ, దుబారా ఖర్చుల వల్లే రాష్ట్రానికి ఈ దుస్థితి దాపురించిందని చెప్పారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయం, అప్పుల పై తప్పుడు లెక్కలతో నిస్సిగ్గుగా పుస్తకాలు వేసి ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని, సబ్‌ప్లాన్ నిధులను మళ్లించడమే కాకుండా ప్రజలపై పన్నుల భారం వేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు సొంత కాళ్లపై నిలబడేలా ఆనాడు టీడీపీ ఎంతో కృషి చేస్తే నేడు ఆయా వర్గాలకు చెందిన సుమారు రూ.1.14 లక్షల కోట్ల నిధులను దారిమళ్లించారని ఆరోపించారు. అలాగే 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 10శాతం రిజర్వేషన్లను రద్దు చేసి 16800 రాజ్యాంగబద్ధ పదవులను దూరం చేశారని అన్నారు. జగన్ రెడ్డి పాలనతో ఒక్కో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కుటుంబాలపై రూ.2,79,136 ఆర్థిక భారం పడిందని అన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

శ్రీశైలం, ఫిబ్రవరి 8: రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం సుండిపెంటలోని మాల మహానాడు కాలనీ, పూర్ణానంద ఆశ్రమం, ఎలిమెంటరీ స్కూల్ ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైసీపీ ప్రభుత్వం విధానాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలందరూ అవస్థలు పడుతున్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని గుర్తు చేశారు. అనంతరం 50 కుంబాలు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి.

సమస్యల పరిష్కారానికి రోడ్డెక్కిన ఆశా వర్కర్లు



పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

నందికొట్కూరు ఫిబ్రవరి 8: న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ ఆశా వర్కర్లు రోడ్డెక్కారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి ఆశా వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని ర్యాలీగా పటేల్ సెంటరుకు చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ టౌన్ కార్యదర్శి గోపాలకృష్ణ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆశాలకు ఇచ్చిన వాగ్దానాలను అటకెక్కించారని అన్నారు. దీంతో ఆశా వర్కర్లు చలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టగా వారిని అరెస్టు చేయించడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్లుగా ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. వారి సమస్యలను పరిష్కరించకుండా ఆశా వర్కర్లను నిర్బంధించి నోటీసుల ద్వారా బెదిరించడం చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మె బాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కర్ణ, ఆశా వర్కర్లు యూనియన్ నాయ కులు కృష్ణవేణి, నాగసాములమ్మ, మంజుల ఉమాభారతి, శ్యామలమ్మ పాల్గొన్నారు.

బడ్జెట్ ఆసాంతం అభూత కల్పన : ఫరూక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 8 : బడ్జెట్ ఆసాంతం అభూత కల్పనే అంటూ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం నంద్యాల ఖలీల్ థియేటర్ ఆవరణలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్ళ నుంచి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. బడ్జెట్ పేరుతో మైనార్టీలను దగా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తూ ప్రతి స్కీమ్‌ను స్కామ్‌గా చేశారని మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకుంటున్న ఇబ్రహీం

ఆత్మకూరు, ఫిబ్రవరి 8: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీశైలం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం ఆత్మకూరుకు చెందిన ఆ పార్టీ నాయకులు ఇబ్రహీం గురువారం దరఖాస్తు చేసుకున్నారు. విజయవాడలో ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన తన దరఖాస్తును అందజేశారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే శ్రీశైలం నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడిం చారు. కాంగ్రెస్ పార్టీకి శ్రీశైలం నియోజకవర్గం కంచుకోట అని, తనకు అవకాశం ఇస్తే కచ్చితంగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.

బొలేరో ఢీకొని ఒకరికి గాయాలు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 8: మండల కేంద్రంలో గురువారం తెల్లవారు జామున బొలేరో వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సుల్తాన్ తెల్లవారు జామున మోటార్‌సైకిల్‌పై మసీద్‌కు వెళుతుండగా ఆత్మకూరు నుంచి కర్నూలు వైపు వస్తున్న బొలేరో వాహనం వెనుక నుంచి ఢీకొంది. అక్కడే హోటల్ వద్ద ఉన్నవారు బొలేరో వాహనాన్ని వెంబడించారు. క్షతగాత్రుడిని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా వుశేనాలం స్వామి పీర్ల జాతర



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 8: నంద్యాల నూనెపల్లెలో వెలసిన వుశేనాలం స్వామి పీర్ల జాతర సందర్భంగా గురువారం నంద్యాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం జాతర కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన ఎద్దుల పందెం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మంచాల విజయబాస్కర్‌రెడ్డి, మంచాల అవినాష్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

పాణ్యం, ఫిబ్రవరి 8: మండలంలోని నెరవాడ మెట్ట సమీపంలోని బాటసుంకులా పరమేశ్వరి ఆలయ 5వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెంకటేశ్వర్లు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు తీర్థ ప్రసాద స్వీకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

తపాలా శాఖ సేవలను వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

గోస్పాడు, ఫిబ్రవరి 8 : తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల పోస్టల్ సబ్ డివిజనల్ అధికారి సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని పసురుపాడు, గోస్పాడు, జూలేపల్లె గ్రామాల్లో తపాలా శాఖ సిబ్బంది పొదుపు పథకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామూలు బ్యాంకుల మాదిరే తపాలా శాఖ పని చేస్తుందని, చిన్న కుటుంబాలకు ఎంతో ఉపయోగపడే ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు అందిస్తుందని, కుటుంబ సంరక్షణ కోసం గ్రామీణ తపాలా జీవిత బీమా ద్వారా సేవింగ్స్, రిస్క్ కవరేజ్, ఇన్‌కాం ట్యాక్స్ రాయితీ కూడా పొందవచ్చునని తెలిపారు. 10 సంవత్సరాలలోపు బాలికలకు సుకన్య సమృద్ధి ఖాతాలు తెరుచుకోవాలని సూచించారు. నెలకు రూ.1000 చొప్పు 15 సంవత్సరాలకు పాప పేరుమీద చెల్లిస్తే మొత్తం సొమ్ము మూడు రెట్లు అవుతుందని తెలిపారు.

మినీ డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ

పాణ్యం, ఫిబ్రవరి 8 : వైసీపీ హడావుడిగా చేపట్టిన మినీ డీఎస్సీ దగా డీఎస్సీగా మారిందని రాష్ట్ర టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి రాంమోహన్ నాయుడు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల స్టంటుగా నిరుద్యోగుల ఓట్ల కోసమే 117 జీఓతో డీఎస్సీ జారీ చేశాడన్నారు. రాష్ట్రంలో 25 వేల పోస్టులు ఖాళీ ఉండగా ఆరువేల పోస్టులు భర్తీకి పూనుకోవడం నిరుద్యోగులను మోసం చేయడమేనన్నారు. ఎన్నికల హామీలలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామన్న జగన్ అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. జగన్‌ను నమ్మే పరిస్థితి ప్రజలు లేరని, వైసీపీని ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



పూజలందుకున్న దత్తాత్రేయ స్వామి



శ్రీశైలం, ఫిబ్రవరి 8: శ్రీశైలం మహా క్షేత్రంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం వద్ద నెలకొల్పిన దత్తాత్రేయ స్వామి వారికి లోక కల్యాణార్థం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను జరిపించి అనంతరం దత్తాత్రేయ స్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపారు.

ఆకట్టుకున్న నిత్య కళారాధన

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్య కళారాధన కార్యక్రమంలో గురువారం హైదరాబాద్‌కు చెందిన స్నేహలత బృందంచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయకకౌత్వం, శివాష్టకం, జయజయదుర్గ, అఖిలాండేశ్వరి, ఓం నమఃశివాయ తదితన గీతాలకు స్నేహలత తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం నల్గొండకు చెందిన మంచికంటి భాస్కర్ అనే భక్తుడు రూ. 1,01,116 విరాళాన్ని, రంగారెడ్డికి చెందిన కె.సత్యనారాయణ రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.



నృత్యం చేస్తున్న కళాకారిణి



దాతకు ప్రసాదాలు అందజేస్తున్న పర్యవేక్షకురాలు హిమబిందు

ప్రారంభమైన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ



ముసలిమడుగు సచివాలయంలో కంప్యూటర్లను పరిశీలిస్తున్న సబ్ రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి

కొత్తపల్లి, ఫిబ్రవరి 8: సాంకేతిక లోపం కారణంగా గత ఐదు రోజులుగా కొత్తపల్లి మండలంలో నిలిచిపోయిన జగనన్న గృహాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎట్టకేలకు గురువారం ప్రారంభమైంది. బుధవారం ఆంధ్రజ్యోతిలో సాంకేతిక లోపంతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు అనే వార్త ప్రచురితమైంది. దీంతో నంద్యాల సబ్ రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి, ఆత్మకూరు సబ్ రిజి స్ట్రార్ ఆదినారాయణలు స్పందించారు. మండలంలోని ముసలిమడుగు గ్రామ సచివాలయంలో సాంకేతిక కారణాలతో కంప్యూటర్లు మొరాయిస్తుండటంతో వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిదిద్దారు. ఈ మేరకు వీఆర్వో రామసుబ్బయ్య, పంచాయతీ సెక్రటరీ షహీన్‌షా, డిజిటల్ అసిస్టెంట్ ప్రియాంకల ఆధ్వర్యంలో ఏడు రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. ఇంకా గ్రామంలో 57 మంది లబ్ధిదారుల గృహాలకు రిజిస్టర్ చేయాల్సి ఉంది.

హామీలు అమలు చేయాలి



కోఆప్షన్ సభ్యుడికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఫిబ్రవరి 8: మున్సిపల్ కార్మికుల సమ్మె హామీలను అమలు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహనాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు గొడుగు రాజు, తిమ్మయ్యలు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్‌కు వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగన్న, రాజేంద్ర, జయన్న, సురేష్, రవి, దానమయ్య, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, కుమారీ తదితరులు ఉన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు ఫిబ్రవరి 8: పట్టణంలోని జగనన్న కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం కాలనీవాసులు కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలోని జగనన్న కాలనీలో నీటి సమస్యల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జగనన్న కాలనీలో నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, కర్ణ, హుస్సేన్ బాషా, శంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, శ్రీనివాసులు, ఉషనయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



గుడి నిర్మాణానికి విరాళం అందిస్తున్న అభిరుచి మధు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 8: నూనెపల్లె ఫ్లైఓవర్ దగ్గరలో ఉన్న గౌరీ కేదార్నాథ్ స్వామి ఆలయ నిర్మాణానికి నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు రూ.1,00,116 విరాళం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మట్లాడుతూ రూ.5 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న గౌరీకేదార్నాథ్ స్వామి గుడికి తనవంతు సహాయంగా విరాళం అందజేశానని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు మురళీధర్, డాక్టర్ ఇంటి ఆదినారాయణ, ఆలయ నిర్వాహకులు ప్రసాద్, పక్కీరగౌడ్, తిమ్మయ్య, కన్నె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటపై నమ్మకం ఉంది

» టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

ప్యాపిలి, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో డోన్ అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా తన పేరును అధినేత చంద్రబాబునాయుడు మొదటిసారి ప్రకటించారని, ఆయన మాటపై తనకు నమ్మకం ఉందని ఆ పార్టీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. డోన్ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా తానే నిలబడతానని ఆయన తెలిపారు. కోట్ల, కేఈ కుటుంబాల సహాయ, సహకారాలు ఉంటాయని ఆశిస్తున్నట్లు సుబ్బారెడ్డి చెప్పారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోట్ల, కేఈ కుటుంబాల సూచన మేరకే చంద్రబాబు తనను డోన్ ఇన్‌చార్జిగా ప్రకటించారన్నారు. అధినేత ఆదేశాల ప్రకారం నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు. అయితే పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన కొంతమంది కార్యకర్తలను అయోమయంలో పెట్టేందుకు పార్టీకి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు కట్టడం బాధాకరమన్నారు. వారిపై అధిష్ఠానం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ఈ రాఘవేంద్ర, చిన్న సుంకయ్య, పివెంకటేశ్వరరెడ్డి, రామ్మోహన్‌యాదవ్, చల్లా వీరాంజినేయులు, సుదర్శన్, ఎస్ మధు, నాగేంద్ర, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను వినియోగించుకోవాలి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 8: పోస్టల్ శాఖ చేపడుతున్న పథకాలను వినియోగించుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎ.చంద్రమౌళీశ్వరరెడ్డి కోరారు. ఆళ్లగడ్డ మండలంలోని చింతకొమ్మదిన్నె గ్రామంలో గురువారం పోస్టల్ పథకాలపై ర్యాలీ చేశారు. గ్రామీణ ప్రజల కోసం తపాలా బీమా, ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన, ఆర్డీ, టైం డిపాజిట్ పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో మెయిల్‌వర్సర్స్ భాస్కరరావు, రాజు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాజీ రాష్ట్రపతి జయంతి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 8: భారత దేశ మూడో రాష్ట్రపతి దివంగత నేత జాకీర్ హుసేన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఆర్‌కే పాఠశాలలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్‌బాషా జాకీర్ హుసేన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ రాష్ట్రపతి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగరాజు, శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

దొర్నిపాడు, ఫిబ్రవరి 8: రానున్నది వేసవి కాలం కావడంతో ఆరోగ్యంపై ప్రజలు శ్రద్ధ వహించాలని యూనాని వైద్యాధికారి షకిరా బేగం సూచించారు. గురువారం దొర్నిపాడులో ఉచిత యూనాని వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వృద్ధులు బయట ఎక్కువగా తిరగరాదని సూచించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రుహుల్లాఖాన్, సిబ్బంది ఉన్నారు.

టీడీపీ నాయకుడి మృతి బాధాకరం

చాగలమర్రి, ఫిబ్రవరి 8: మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, రైతు బాలవీరయ్య పాముకాటుకు గురై మృతి చెందడం బాధాకరమని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్ అన్నారు. గురువారం టీడీపీ నాయకుడి మృతి విషయం తెలుసుకున్న భార్గవ్‌రామ్ మృతుడి గృహం వద్దకు వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. కుటుంబీకులను పరామర్శించి వారిలో మనోధైర్యం నింపారు. కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాదురెడ్డి, శేఖర్‌రెడ్డి, రామసుబ్బయ్య, రామకృష్ణ, నరసింహుడు, ప్రమోద్‌కుమార్, రవి ఉన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

చాగలమర్రి, ఫిబ్రవరి 8: మండలంలోని గొడిగనూరు గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు, రైతు బాల వీరయ్య (70) గురువారం పాము కాటుకు గురై మృతి చెందాడు. తన పొలంలో నీరు కడుతుండగా పాముకాటుకు గురై మృతి చెందాడని కుటుంబీకులు తెలిపారు. పాముకాటుతో మృతి చెందిన బాల వీరయ్యకు ప్రభుత్వపరంగా సాయం అందించాలని కుటుంబీకులు కోరారు. ఆయన మృతి పట్ల టీడీపీ నాయకులు సంతాపం ప్రకటించారు.

ఉరి వేసుకొని ఇద్దరి ఆత్మహత్య

దొర్నిపాడు/ కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 8: జిల్లాలో వేర్వేరు చోట్ల ఉరి వేసుకొని ఇద్దరు మృతి చెందారు. మండలంలోని దొర్నిపాడులో దాసరి సువర్ణ (40) బుధవారం సాయంత్రం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సువర్ణ కొన్ని రోజుల నుంచి కడుపు నొప్పితో బాధపడుతుండేది. జీవితంపై విరక్తి చెందిన ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. భర్త పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు. అలాగే కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామానికి చెందిన కంబయ్య (40) ఉరివేసుకున్నాడు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన కంబయ్య తండ్రి వృద్ధాప్యంతో, దివ్యాంగ కుమారుడు అనారోగ్యంతో నెల రోజుల క్రితం మృతి చెందడంతో తీవ్రమనస్తాపానికి గురైన కంబయ్య జీవితంపై విరక్తి చెంది బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

బేతంచెర్ల, ఫిబ్రవరి 7: బేతంచెర్ల పట్టణంలోని గౌరిపేటకు చెందిన రేష్మా పదో తరగతి చదువుతోంది. రేష్మా పేద విద్యార్థిని కావడంతో రూ.10వేలు ఆర్థిక సాయాన్ని పాఠశాల కోఆర్డినేటర్ మహేశ్వరికి గురువారం అందజేశారు. సుమేధ స్కూలులో పదో తరగతి విద్యార్థి రేష్మా పాఠశాల ఫీజు నిమిత్తం ఆర్థిక సాయం అందజేసినట్లు సముద్రాల శ్రీధర్, జశ్వంత్ రెడ్డి, పెసల శ్రీధర్, సి.రవీంద్ర, ఎల్ఐసీ శివ, మురళి, సుధాకర్ అందజేసినట్లు తెలిపారు.

ఉత్సవ పల్లకికి పూజలు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 8: ఆళ్లగడ్డ పట్టణంలో అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ పల్లకి ప్రజలచే పూజలందుకుంది. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం జిల్లా జడ్జి మునికృష్ణ, సీనియర్ సివిల్ జడ్జి శైలజ, జూనియర్ సివిల్ జడ్జి వెంకట శివప్రసాద్ పూజలు చేశారు.

మండల సమావేశం వాయిదా

సంజామల, ఫిబ్రవరి 8: కోరం లేక మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం వాయిదా వేశారు. ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. సభను జరపడానికి ఎంపీపీతోపాటు ఎంపీటీసీలు గైర్హాజరవడంతో సభ వాయిదా పడింది.



యథేచ్ఛగా మట్కా

» ప్రతిరోజూ రూ.లక్షల్లో టర్నోవర్
» అధికార వైసీపీ నేతల కనుసన్నల్లో జూదం
» పోలీసు అధికారుల అండ దండలు?
» ప్రతి నెలా మామూళ్లు » చెలరేగిపోతున్న బీటర్లు



డోన్, ఫిబ్రవరి 8: డోన్ అడ్డాగా.. మట్కా మాఫియా చెలరేగిపోతోంది. అధికారం అండ ఉంటే.. ఇంకేముంది అన్నట్టుగా మట్కా జోరుగా సాగుతోంది. ఈ జూదం ద్వారా ప్రతి రోజూ రూ.లక్షల్లో టర్నోవర్ జరుగుతున్నట్టు తెలుస్తోంది. మట్కా జూదాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని.. కొందరు నేతలు జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కట్టడి చేయాల్సిన పోలీసు అధికారులు మామూళ్లు దండుకుని ఏమీ పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. పట్టణంలోని కొండపేట, తారకరామనగర్, పాతపేట, కొత్తపేట, వైఎస్ నగర్, ఇంద్రానగర్ తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున మట్కా బీటర్లను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. ఒక్కో ప్రాంతంలో కొందరు మట్కా బీటర్లను ఏర్పాటు చేసుకుని బీట్ సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. మట్కా బీటర్లకు కమీషన్ ఎరవేసి ఆయా ప్రాంతాల నుంచి బీట్‌ను సేకరిస్తున్నట్లు సమాచారం. పట్టణంలో సేకరించే బీట్లను మట్కా కంపెనీ నిర్వాహకులకు చేరవేస్తున్నారు.

● ప్రతి రోజూ రూ.20 లక్షల టర్నోవర్

డోన్ అడ్డాగా.. మట్కా జడలు విప్పుతోంది. కొందరు వైసీపీ నాయకుల అండతో.. విచ్చలవిడిగా మట్కా బీట్‌ను సేకరిస్తున్నారు. ప్రతి రోజూ రూ.20 లక్షల వరకు మట్కా టర్నోవర్ నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ప్రతి నెలా కోట్లాది రూపాయల సొమ్ము చేతులు మారుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. పట్టణంలో ఆయా ప్రాంతాల నుంచి సెల్‌ఫోన్ల ద్వారా బీట్‌ను సేకరించి కంపెనీ నిర్వాహకులకు అందిస్తున్నట్లు సమాచారం. బీటర్లు ఎంతో పకడ్బందీగా సెల్‌ఫోన్ల ద్వారా బీట్‌ను చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. డోన్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పట్టణానికి బీట్‌ను చేరవేస్తున్నట్లు సమాచారం. కొందరు వైసీపీ నేతల ఆధ్వర్యంలో మట్కాబీట్ నడుస్తుండటంతో.. అడిగే నాథుడే కరువయ్యారు. అదేవిధంగా బేతంచెర్ల నుంచి కొందరు బీటర్లు డోన్ పట్టణానికి బీట్‌ను చేరవేస్తున్నట్లు విమర్శలున్నాయి.

● హుశేనాపురంలో..

ప్యాపిలి మండలంలోని హుశేనాపురం గ్రామంలో మట్కా పంజా విసురుతోంది. ఆ గ్రామంలోని ఓ మట్కా బీటరు ఆధ్వర్యంలో భారీ ఎత్తున మట్కాబీట్ సేకరిస్తున్నట్లు సమాచారం. ప్రతి రోజూ రూ.2లక్షల వరకు బీట్ సేకరించి అనంతపురం జిల్లాలోని గుత్తికి చేరవేస్తున్నారు. గ్రామంలోని రైతులు, కార్మికులు మట్కా ఊబిలో కూరుకుపోయి కష్టపడి సంపాదించిన సొమ్మంతా మట్కాకే తగలేస్తున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ప్యాపిలి పట్టణంలో మట్కా జోరుగా నడుస్తుందన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి రోజూ రూ.3 లక్షల పైనే బీట్‌ను సేకరించి గుత్తికి పంపిస్తున్నట్లు తెలుస్తోంది.

● పోలీసు అధికారుల అండదండలు

డోన్ పట్టణంలో అధికార వైసీపీ నేతల కనుసన్నల్లో నడుస్తున్న మట్కా జూదానికి.. పోలీసు అధికారుల అండ దండలు దండిగా ఉన్నాయన్న విమర్శలున్నాయి. పట్టణంలో పెద్ద ఎత్తున మట్కా నడుస్తున్నా.. పోలీసులు చోద్యం చూస్తుండటంపై పలువురు నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. కొందరు అధికార పార్టీ నేతల ఆధ్వర్యంలో మట్కా కంపెనీ నడుస్తుండటం వల్లనే... అటువైపు పోలీసు అధికారులు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మట్కా నిర్వాహకులతో ప్రతినెలా మామూళ్లు దండుకుని కిమ్మనకుండా ఉంటున్నారని సమాచారం.

మట్కా నియంత్రణకు చర్యలు తీసుకుంటాం

డోన్ పట్టణంలో మట్కా నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. మట్కా స్థావరాలపై దాడులు నిర్వహిస్తాం. మట్కా జూదానికి పోలీసు అధికారుల అండ దండలు ఉన్నాయన్న విమర్శల్లో నిజం లేదు. కింది స్థాయి పోలీసులు సహకరిస్తున్నట్లు మా విచారణలో తేలితే చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరెడ్డి, డోన్ డీఎస్పీ

యువత ఆలోచించి ఓటు వేయాలి: మాజీ మంత్రి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 8: వచ్చే ఎన్నికల్లో యువత ఆలోచించి ఓటు వేయాలని తొలిసారి ఓటు నమోదు చేసుకున్న యువతకు మాజీ మంత్రి అఖిలప్రియ, ఆమె తమ్ముడు భూమా విఖ్యాత్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని రామలింగారెడ్డి కళ్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన యువతతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశ, రాష్ట్రాభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. యువతకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన వైసీపీ మోసం చేసిందన్నారు. ఎవరు అభివృద్ధి చేశారు.. ఎవరి వల్ల న్యాయం జరుగుతుందనే విషయాలు తెలుసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈసమావేశంలో భార్గవ్‌రామ్‌నాయుడు, పట్టణంలోని డిగ్రీ కళాశాలల యాజమాని అనంత రామసుబ్బారెడ్డి, కేవీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు చాంద్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి అఖిలప్రియ

రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతో ముడిపడి ఉంది

శిరివెళ్ల: రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతో ముడిపడి ఉందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో పర్యటించి టీడీపీ మినీ మ్యాని ఫెస్టోలోని పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. చంద్రబాబును సీఎంగా చేసుకుంటేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, కమతం లక్ష్మీరెడ్డి, కమతం పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, శీలం లక్ష్మీప్రసాదు, రామ్మోహన్, బీసీ ఖాజాహుసేన్, కుందూరు మోహన్‌రెడ్డి, యామా గుర్రప్ప, సూరా రామ, బాలచంద్రుడు, రవి, జనార్దన్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ

డోన్, ఫిబ్రవరి 8: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని డోన్ నియోజకవర్గ టీడీపీ సలహాదారుల కమిటీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, నియోజకవర్గ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 25వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మురళీకృష్ణగౌడు, సీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చే ముందర డీఎస్సీ నోటిఫికేషన్ పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి అభిరెడ్డిపల్లె గోవిందు, అజీజ్, చక్రపాణిగౌడు, ఎల్ఐసీ శ్రీరాములు, ఆలీబాబా, కేబుల్ కిరణ్, హుశేన్‌పీరా, నీలం ప్రభాకర్ పాల్గొన్నారు.

చాగలమర్రి: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు రఫిద్దిన్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. గురువారం చాగలమర్రిలోని చిన్న మకానం వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు అబ్దుల్లా, బషీర్, నరసింహా, శ్యాబుల్, గైబువలి, కృష్ణ పాల్గొన్నారు.



చాగలమర్రిలో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

భోజన పథకం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

ప్యాపిలి, ఫిబ్రవరి 8: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న భోజన పథకంలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం సంఘం నాయకుడు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం ఎంపీడీవో సాయిమనోహర్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు.

తప్పుడు సమాచారం పోస్టు చేస్తే చర్యలు: సీఐ

డోన్(రూరల్), ఫిబ్రవరి 8: సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం పోస్టు చేస్తే చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. గురువారం రాత్రి ఆయన కార్యాలయంలో సీఐ మాట్లాడుతూ ఇటీవల సోషల్ మీడియా వేదికగా వాట్సాప్ గ్రూపులు, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలలో యాత్ర-2 సినిమా విడుదల సందర్భంగా అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, గ్రామ, వార్డు వలంటీర్లు ఈ సినిమాను తప్పనిసరిగా చూడాలంటూ జీవో వచ్చినట్లు తప్పుడు సమాచారం పెడుతున్నారన్నారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రిజిస్ట్రేషన్లు వంద శాతం పూర్తి చేయాలి

రుద్రవరం, ఫిబ్రవరి 8: మండలంలోని హౌసింగ్ రిజిస్ట్రేషన్లు వంద శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో రామచంద్ర అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో హౌసింగ్ రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిన్నవంగలిలో ట్యాంకర్లతో నీటి సరఫరా

చాగలమర్రి, ఫిబ్రవరి 8: మండలంలోని చిన్నవంగలికి టీడీపీ నాయకులు గురువారం ట్యాంకర్లతో నీటి సరఫరా చేశారు. కలుషిత నీరు వస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ట్యాంకర్లతో నీటి సరఫరా చేశారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కలిసి ఆరు ట్యాంకర్లతో మంచి నీటి సరఫరా చేశారు. కార్యక్రమంలో టీడీపీ యూత్ సభ్యులు నరేంద్రారెడ్డి, నర్సిరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, వంశీ, శ్రీరాములు, బాషా, రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 8: శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర అన్నారు. గురువారం మండలంలోని భీముని పాడులో గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మద్యం విక్రేత అరెస్టు

సంజామల, ఫిబ్రవరి 8: రెడ్డిపల్లె గ్రామానికి చెందిన పగడాల సుబ్బయ్య కాశీపురం రస్తాలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ రమేశ్‌రెడ్డి, సిబ్బందితో దాడి నిర్వహించారు. 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల పరిశీలన

రుద్రవరం, ఫిబ్రవరి 8: రుద్రవరం మండలంలో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను తహసీల్దారు మురళీమోహన్ గురువారం పరిశీలించారు. మండలంలోని ఎర్రగుడిదిన్నె, పేరూరు, చిలకలూరు, చందలూరు, మందలూరు, చిన్నకంబలూరు,, పెద్ద కంబలూరు, యల్లావత్తుల, వెలవలిపల్లె, కొండమాయపల్లె, రుద్రవరం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు పరిశీలించారు. కొత్తవెలగలపల్లెలో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీఆర్వోలు ఫకృద్దీన్, నారా యణ, మల్లేశప్ప, నీలకంఠం, నరసింహ, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వరుడి కల్యాణం

బనగానపల్లె, ఫిబ్రవరి 8: మండలంలోని యాగంటి క్షేత్రంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా ఉమామహేశ్వర స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కళ్యాణాన్ని తిలకించారు.

సమాజ సేవ అలవర్చుకోవాలి

శిరివెళ్ల, ఫిబ్రవరి 8: ప్రతి ఒక్కరూ బాధ్యతగా సమాజ సేవ అలవర్చుకోవాలని స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు అన్నారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజనలో భాగంగా యర్రగుంట్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించుకునేందుకు వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు గ్రామానికి చెందిన సునార్ రహ్మతుల్లా కుటుంబ సభ్యులు గురువారం పౌష్టికాహారం అందజేశారు.

బనగానపల్లె తహసీల్దారుగా రవీంద్రారెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 8: బనగానపల్లె నూతన తహసీల్దారుగా రవీంద్రారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దారుగా పనిచేస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి యథావిధిగా డిప్యూటీ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా కలసపాడు తహసీల్దారుగా పనిచేస్తున్న ఆయనను ఎన్నికల నేపథ్యంలో బదిలీ చేశారు.

బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌కు సన్మానం

డోన్, ఫిబ్రవరి 8: డోన్ తహసీల్దార్‌గా పని చేస్తూ కడప జిల్లాకు బదిలీ అయిన తహసీల్దార్ విద్యాసాగర్‌కు గురువారం రాత్రి వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. పట్టణంలోని షాదీఖానాలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో తహసీల్దార్ విద్యాసాగర్‌ను సన్మానించారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, రూరల్ సీఐ అశ్రత్‌బాషా, జడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో ప్రభాకర్ తహసీల్దార్ విద్యాసాగర్‌ను పూలబొకేలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇది అంకెల గారడీ బడ్జెట్: టీడీపీ

డోన్, ఫిబ్రవరి 8: ఏపీ అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెలగారడీగా ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ అన్నారు. గురు వారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద వారు మాట్లాడుతూ ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశ పెట్టిన బడ్జెట్ రైతుకు వ్యతిరేకంగా ఉందన్నారు. రైతులను ఆదుకునేందుకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేకపోవడం అన్యాయమని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో మొండిచేయి చూపారని ధ్వజమెత్తారు. ప్యాపిలి మండల టీడీపీ అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, టీడీపీ బీసీ సెల్ నాయకులు జయరాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వలసల రామకృష్ణ

అరాచక పాలనకు చరమగీతం పాడండి: భూమా

దొర్నిపాడు, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలని ఆళ్లగడ్డ టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇందిరానగర్, దొర్నిపాడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లేశ్వరచౌదరి, మాజీ సొసైటీ అధ్యక్షుడు సిద్ధి సత్యం, మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ, అమరసాని రవి, చాకరాజువేముల మాజీ ఆలయ ధర్మకర్త లింగుట్ల వెంకట్‌నాయుడు, దయానందరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

కోవెలకుంట్ల, ఫిబ్రవరి, 8: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోనే సాధ్యం అని టీడీపీ నాయకుడు డాక్టర్ శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ పేరుతో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాలలో నాశనం చేశాడన్నారు.

కళాశాలను కాపాడుకుందాం

సంజామల, ఫిబ్రవరి 8: సంజామల కళాశాలను కాపాడుకుందామని సంజామలవాసి, కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సంజామల ఉన్నత పాఠశాలలో కానాల, సంజామల, గిద్దలూరు, కమలపురి కెజీబీవీ పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పెండేకంటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తన పెదనాన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, బీహార్, కర్నాటక రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసిన దివంగత పెండేకంటి వెంకటసుబ్బయ్య ఈ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, ఎంఈవో రాజయ్య, శంకర్, అధ్యాపకులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పూర్తి చేస్తాం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 8: కొలిమిగుండ్లలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మార్చి చివరినాటికి పూర్తి చేస్తామని రామ్‌కో సిమెంట్ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు అన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆయన పరిశీలించారు. విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయల కాలానికి చెందిన పురాతన వైష్ణవ దేవాలయాన్ని రూ. 8 కోట్లతో జీర్ణోద్ధరణ చేస్తున్నామని, మార్చి చివరినాటికి పనులు పూర్తవుతాయని తెలిపారు.

పత్తి సాగుపై కిసాన్ మేళా



పత్తి పంట సాగు బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ఎంపీ, శాస్త్రవేత్తలు

బనగానపల్లె, ఫిబ్రవరి 8: బనగానపల్లె పట్టణంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రంలో వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్తిపంట సాగు అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై రైతులతో కిసాన్‌మేళా అవగాహన సదస్సును గురువారం యాగంటిపల్లె కృషివిజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్తిసాగుపై ఉత్పాదకతను పెంచుకొని లాభసాటిగా ఎలా పంటను మార్చుకోవాలి అన్న విషయాలను వివరించారు. ప్రత్తిపరిశోధక కేంద్రం నాగపూర్ వారు పండిస్తున్న స్వల్పకాలిక రకమైన రాసిస్విఫ్ట్ పత్తి విత్తనాలపై అవగాహన కల్పించారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రసాయన పురుగు మందులు తగ్గించి ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో పత్తి పంటను అధిక సాంద్రత పద్ధతితో అధిక లాభాలు గడించవచ్చని రైతులకు సూచించారు. జీవాల పెంపకంపై బనగానపల్లె మండలం కైప గ్రామానికి చెందిన రైతు రఘునాథరెడ్డిని, ప్రకృతి వ్యవసాయంలో పగిద్యాలకు చెందిన వెంకటేశ్వర్లు, చిరుధాన్యాల ఉత్పత్తి తయారీలో గులాంనబీపేట జీవీ. సుబ్బారెడ్డి, ఉద్యానవన రైతు వై.నాగ లక్ష్మిరెడ్డిలను శాలువాలతో సత్కరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ భరత్‌కుమార్‌రెడ్డి, ఆత్మ పీడీ వరలక్ష్మి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కమలమ్మ పాల్గొన్నారు.